


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

శనివారం 24 మే 2025 పేజీలు 05




### ధాన్యం కొనుగోలు ప్రక్రియను

## వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి,మే23, సూర్య మేజర్ న్యూస్ :**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలం పోలంపల్లి, భీమారం, అక్కపల్లి, అంకుసాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

మిగితా..2లో

### నాటిన ప్రతి మొక్కను

## సంరక్షించాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**కాగజ్ నగర్,మే 23,సూర్య మేజర్ న్యూస్ :**

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భారత ప్రభుత్వ గృహ నిర్మాణం, పట్టణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రారంభించిన ఏక్ పేడ్ మాకే నామ్ / ఉమెన్ ఫర్ ట్రీస్ క్రింద ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తల్లుల పేరిట ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా మాతృమూర్తులను గౌరవించు కుందామని అన్నారు. ప్రస్తుత వాతావరణంలో వస్తున్న మార్పులను తట్టుకునేందుకు, పట్టణాలలో పెరుగుతున్న వేడిని నియంత్రించేందుకు, బ్లూ, గ్రీన్ మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు అమృత మిత్ర కార్యక్రమం క్రింద మహిళా సంఘాల సభ్యులతో ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని తెలిపారు.



మిగితా..2లో

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో

## ముందుకు సాగాలి

**- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు**

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్,23మే,సూర్య మేజర్ న్యూస్ :**

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ



కనబరిచిన విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్, శాసన సభ్యులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

( మిగితా…3లో )

### డి.ఈ.ఈ.టి. ఆన్లైన్ ప్లాట్ఫామ్లో

## వివరాలు నమోదు చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగులు, వివిధ పరిశ్రమలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ల వివరాలను డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డి.ఈ.ఈ.టి.) ఆన్లైన్ ప్లాట్ఫామ్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డి.ఈ.ఈ.టి. ఆన్లైన్ ప్లాట్ఫామ్ కమిటీ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగులు, వివిధ పరిశ్రమలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్లను డి.ఈ.ఈ.టి. ఆన్లైన్ ప్లాట్ఫామ్లో నమోదు చేయించాలని తెలిపారు. ( మిగితా…2లో )

### బాల్య వివాహాల నిర్మూలనకు

## పటిష్ట చర్యలు

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ ప్రతినిధి,23మే,సూర్య మేజర్ న్యూస్**



జిల్లాలో బాల్యవివాహాలకు పూర్తి స్థాయిలో నియంత్రించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాల్యవివాహాల నిర్మూలన, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, ఇసుక అక్రమ రవాణా, మున్సిపల్ అంశాలు, రహదారి భద్రత, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు పంపిణి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. గత రెండు సంవత్సరాలలో జిల్లాలో 29 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు జరుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించినవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరచూ గ్రామాలను సందర్శిస్తూ మళ్ళీ వివాహం జరపకుండా చూడాలన్నారు. సంబంధిత బాలబాలికలకు మెరుగైన విద్యను అందించాలన్నారు.

( మిగితా…2లో )


## అభివృద్ధి పనులలో

### నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**ఆసిఫాబాద్ ప్రతినిధి, మే 23, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి



అన్నారు. శుక్రవారం జిల్లాలోని సిర్పూర్ యు మండలంలో పర్యటించి కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు.

( మిగితా..2లో )



### విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే

## కఠిన చర్యలు

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**కాగజ్ నగర్ ,మే 23, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు క్రైస్తవ కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల హిమాన్ను ట్రేడర్ ఫర్టిలైజర్ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా సందర్శించి స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రం, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు పరిశీలించి అక్కడి రైతులకు విక్రయిస్తున్న ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మిగితా. 2లో

సూర్య www.suryaa.com
శనివారం 24 మే 2025

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మొదటి పేజీ తరువాయి...

అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు.



అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సదానందంతో కలిసి సందర్శించి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియ, ఇందిరమ్మ ఇండ్ల అంశాలను పరిశీలించారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులకు మాత్రమే వర్తింపచేయాలని, అనర్హులకు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. పథకం అమలులో అవకతవకలు జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, వివిధ రకాల ధృవపత్రాల జారీ కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే



విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్దిదారులకు అందే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## డి.ఈ.ఈ.టి. ఆన్లైన్ ప్లాట్ఫామ్లో వివరాలు నమోదు చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మొదటి పేజీ తరువాయి...

జిల్లాలోని ఐ.టి.ఐ. పనులను త్వరగా పూర్తి చేయాలని, జూన్ మాసంలో జాబ్ మేళాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు గాను ముందుగానే కంపెనీలకు సమాచారం అందించాలని, తద్వారా నిరుద్యోగ యువతకు మేలు కలుగుతుందని తెలిపారు. జిల్లాలో జాబ్మేళా నిర్వహించేందుకు ఎక్కువగా కంపెనీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, డిగ్రీ, పి.జి., నర్సింగ్ కళాశాలల యాజమాన్యాల సమన్వయంతో జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిరుద్యోగులు/ పరిశ్రమలు / సంస్థలు ఆన్లైన్లో deet.telangana.gov.in వెబ్సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సి.రవికిరణ్, జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి కీర్తి రాజ్వీరు, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ దేవేందర్, ప్రభుత్వ ఐ.టి.ఐ. ప్రిన్సిపల్ వై. రమేష్, టాస్క్, మెప్మా, కార్మిక శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

మొదటి పేజీ తరువాయి..

జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేస్తూ, కేంద్రాలలో పనిచేస్తున్న వారి అర్హత పత్రాలను వైద్య శాఖ అధికారులు సరిచూడాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆర్ఎంపి లు ప్రథమ చికిత్స తప్ప, ఏ ఇతర చికిత్సలను చేయకుండా నియంత్రించాలని ఆదేశించారు. నిర్మల్ జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి, నాటు సారా ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను గుర్తించి, కేసులు నమోదు చేయాలన్నారు. విద్యా సంస్థల 400 మీటర్ల పరిధిలో గుట్కా, సిగరెట్ అమ్మకాలను నిషేధించాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అధిక ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. తరచూ ప్రమాదాలు సంభవించే ప్రదేశాల్లో సూచికల బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి ప్రమాదాలు నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కేసుల విచారణ వేగవంతంగా ఉండాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టేలా అధికారులను




ఆదేశించారు. నకిలీ వ్యవసాయ విత్తనాల అమ్మకానికి అడ్డుకట్ట వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీలు చేయాలనీ అన్నారు. విత్తనాల నాణ్యతపై అనుమానాలు ఉంటే నాణ్యతా పరీక్షలకు పంపాలని, నిషేధించిన విత్తనాలు, పురుగుల మందుల వాడకంపై నిషేధం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయించిన దుకాణదారులు, డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించాలని, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అక్రమంగా ఇసుక త్రవ్వకాలు చేపట్టినా, నిల్వ ఉంచిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. గృహ, ఇతర నిర్మాణాల అవసరాలకు రుసుములు చెల్లించి, రసీదులు పొందిన వారికి మాత్రమే ఇసుకను సరఫరా చేయాలన్నారు.

అనంతరం ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిరోధించడానికి సంక్షేమ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని అన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే ట్రాఫిక్, మహిళా పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టామని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ మత్తుపదార్థాల వాడకాన్ని పూర్తిగా నిరోధిస్తామని తెలిపారు. గంజా, నిషేదిత మత్తుపదార్థాలు వినియోగించిన, రవాణా చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 100 లేదా 8712659599 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గంజా, నిషేదిత మత్తుపదార్థాల నిషేధంపై అధికారులతో కలిసి పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి, సంక్షేమ, వైద్యారోగ్య, పోలీసు, అబ్కారీ, ఆర్ అండ్ బి, మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ, విద్యా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

మొదటి పేజీ తరువాయి...

మున్సిపల్ అధికారులు, అమృత మిత్ర సభ్యులు పట్టణాలలో గుర్తించిన చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, పార్కులలో చెట్లు నాటేందుకు అనువుగా ఉండే ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటి వాటిని రక్షించుకోవాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాజీవ్ యువ వికాసం పథకంలోని అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జిల్లాస్థాయి కమిటీకి పంపించాలని అధికారులకు సూచించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాలలో అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వం యూనిట్లు ప్రారంభించేందుకు రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పిస్తుందని, జూన్ 2వ తేదీ నాటికి అర్హులైన వారికి మంజూరు పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారి జాబితాను సిద్ధం చేసి జిల్లా కమిటీకి సమర్పించాలని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ ను ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వివిధ పనుల కొరకు కార్యాలయానికి వచ్చే వారికి క్యాంటీన్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, తహసిల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కాగజ్ నగర్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి మనోహర్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మోతిరామ్, అమృత మిత్ర సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

మొదటి పేజీ తరువాయి..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వంచే గుర్తించబడిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విక్రయ సమయంలో సంబంధిత కంపెనీ పేరుతో రసీదు తప్పనిసరిగా కొనుగోలుదారుకు అందించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే షాపు లైసెన్స్ లను రద్దుచేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. దుకాణంలో నిల్వల వివరాలను ప్రతిరోజు వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని సత్యసాయి ఫర్టిలైజర్స్ షాపును తనిఖీ చేసి రైతులకు విక్రయిస్తున్న కంపెనీ విత్తనాల వివరాలు తెలుసుకున్నారు. రైతుల కోరిక మేరకు అన్ని కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉంచాలని, విత్తన విక్రయ సమయంలో కొనుగోలుదారుకు తప్పనిసరిగా రసీదు అందించాలని, నకిలీ, నిషేధిత విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు విత్తన ప్యాకెట్లను భద్రపరచుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విత్తనాలను విక్రయించాలని, డివిజన్ లో సరిపడా విత్తనాలు అందుబాటులో ఉండేలా, ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రతిరోజు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, ఎ డి ఎ మనోహర్, తహసిల్దార్ కిరణ్, వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

మొదటి పేజీ తరువాయి...

మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన వారికి మార్గదర్శకాల ప్రకారం రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి పథకం ఫలాలు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని పుల్లేరా గ్రామపంచాయతీ పరిధిలోని దేవులపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతి, నిర్మాణ పనులలో నాణ్యత అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అధికారులు నిర్మాణ పనులలో రాజీ పడకూడదని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి నిరంతరాయంగా త్రాగునీరు సరఫరా చేసే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

#### గ్రామపాలన అధికారి పరీక్షను
# పకడ్బంధీగా నిర్వహించాలి
### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,మే23, సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలో ఈ నెల 25వ తేదీన ఉదయం 10.30 గం.ల నుండి మధ్యాహ్నం 1.30 గం.ల వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్




బాలుర ఉన్నత పాఠశాలలో జరుగనున్న గ్రామపాలన అధికారి పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణలో భాగంగా పోలీసు శాఖ అధ్వర్యంలో జవాబు పత్రాల తరలింపు, స్ట్రాంగ్ రూమ్, పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించాలని, పరీక్ష రోజున ఉదయం పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని, వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, హెల్త్ కిట్లు, ఓ.ఆర్. ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, మంచిర్యాల మండల తహశిల్దార్ ఆధ్వర్యంలో జె.ఎన్.టి.యు. నుండి పోలీసు శాఖ సమన్వయంతో పరీక్ష సామాగ్రి తీసుకువచ్చి పోలీసు భద్రత మధ్య ఉంచాలని తెలిపారు. ముఖ్య పర్యవేక్షకుల ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు కూర్చునే విధానం, వెలుతురు, పారిశుద్ధ్యం, త్రాగునీరు, ఇతర మౌళిక సదుపాయాలు పర్యవేక్షించాలని, సరిపడా సిబ్బందిని నియమించుకోవాలని, నిబంధనల ప్రకారం పరీక్షా సామాగ్రిని తీసుకోవాలని, జవాబు పత్రాల సీలింగ్, లేబులింగ్, ప్యాకింగ్ ప్రక్రియను పరీక్షల పరిశీలకుల సమక్షంలో పూర్తి చేసి జిల్లా కలెక్టర్కు నివేదిక అందించాలని తెలిపారు. పరిశీలకులు, సిట్టింగ్ స్క్వాడ్ సమన్వయంతో పరీక్ష కేంద్రం నియంత్రణ, అభ్యర్థులకు సంబంధించిన ఎంప్లాయి ఐ.డి., హాల్ టిక్కెట్ (రిపోర్టింగ్ అధారిటీచే అటెస్ట్ చేయబడిన పాస్పోర్ట్ సైజ్ ఫొటో ఉండాలని) లను క్షుణ్ణంగా పరిశీలించాలని, పరీక్ష నియమ, నిబంధనలను పకడ్బంధీగా అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో పరీక్ష తేది, సమయం, పరీక్ష కేంద్రం, నిబంధనలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో నిర్వహించే పరీక్షకు 155 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, పరీక్ష సమయంలో పరీక్షా కేంద్రం సమీపంలో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. అమలు చేయడం జరుగుతుందని, 5 మంది కంటే ఎక్కువ మంది గుంపుగా ఉండకూడదని, పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష రోజున 10 గం.ల లోపు పరీక్షా కేంద్రంలో ఉండాలని, 10 గం.ల తరువాత ఎవరిని అనుమతించడం జరుగదని, మొబైల్ ఫోన్, టాబ్లెట్, పెన్డ్రైవ్, బ్లూటూత్ పరికరాలు, చేతిగడియారాలు, కాలిక్యులేటర్స్, లాగ్ టేబుల్స్, వాలెట్లు, పర్సులు, నోట్స్, ఛార్ట్స్, లూస్ షీట్స్, రికార్డింగ్ పరికరాలు, హ్యాండ్బ్యాగ్స్, జోలెస్, పౌచెస్, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగదని, పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి క్లాక్ రూమ్ / స్టోరేజ్ సదుపాయం కల్పించడం జరుగదని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ముందు రోజు తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని తెలిపారు. అభ్యర్థులు బ్లూ బ్లాక్ బాల్ పాయింట్ పెన్, హాల్ టిక్కెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు లను మాత్రమే తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. జిల్లాలో గ్రామపాలన పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

### జన్నారం ఇన్చార్జి సెక్షన్ ఆఫీసర్ గా శేషారాం

**జన్నారం, మే 23, సూర్య మేజర్ న్యూస్** : జన్నారం హెడ్ క్వార్టర్ ఇన్చార్జి సెక్షన్ ఆఫీసర్ గా మొబైల్ పార్టీ సెక్షన్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న బి.శేషారాం ను నియమిస్తూ శుక్రవారం మంచిర్యాల్ జిల్లా అటవీ అధికారి శివ్ ఆసిస్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా జన్నారం ఇన్చార్జి బీట్ ఆఫీసర్ గా దేవుని గూడా బీట్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న తిరుమలేష్ కు జన్నారం ఇన్చార్జి బీట్ ఆఫీసర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకాలం పాటు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ తిరుపతి తో పాటు బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ లను విధుల్లో నిర్లక్ష్యం వహించారనే అభియోగంతో సస్పెన్షన్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. జన్నారం ఇన్చార్జి బీట్ ఆఫీసర్ గా నియమితులైన తిరుమలేష్ కు దేవుని గూడా రెగ్యులర్ బీట్ తో పాటు కొత్తూరు పల్లె, కిష్టాపూర్ బీట్లు బాధ్యతలు సైతం అప్పగించారు.

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి
#### - ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు
#### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


మొదటి పేజీ తరువాయి..
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కృషితో మంచి ఫలితాలు సాధించారని, వారి విజయంలో భాగస్వాములైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గర్వంగా ఉందని, భవిష్యత్తులో మరింత స్థాయిలో రాణించి, జిల్లాకు గౌరవం తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి జీవిత లక్ష్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, పదవ తరగతిలో గొప్ప ఫలితాలు సాధించడం అభినందనీయమని, క్రమశిక్షణతో విద్యను కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రతిభ చూపుతున్నారు అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ప్రజాప్రతినిధులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో




అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాధికారి పి. రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలీ, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

#### మారుమూల గ్రామాలకు
## పౌరసరఫరాల సేవలు అందించాలి
#### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

**కెరమెరి,మే 23, సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలోని మారుమూల గ్రామాలకు పౌరసరఫరాల సేవలు అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని కెరమెరి మండలంలో గల మారుమూల గ్రామాలను మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ



మండలంలోని తుమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కటాఫ్ గ్రామానికి చేరుకోవడానికి ఉన్న మార్గాలను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం గోరియాగూడ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నెలకొన్న పరిస్థితుల పై సమీక్షించారు. నిత్యవసర వస్తువుల కొరకు, వర్షాకాలంలో గ్రామంలో నెలకొన్న రవాణా సమస్యలను గ్రామస్తులు జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మారుమూల గ్రామాలకు రవాణా సదుపాయాలు కల్పించి పౌరసరఫరాల సేవలు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామని తెలిపారు. రవాణా సౌకర్యాలు లేని మారుమూల గ్రామాలకు రేషన్ సరుకులు ముందస్తుగా సరఫరా చేయాలని, వర్షాకాలంలో రవాణా ఇబ్బందులు ఏర్పడిన ప్రజలకు నిత్యవసర సరుకులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలపై ప్రభుత్వానికి నివేదించి త్వరలోనే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో 19 వేల 824 మంది రైతుల ఖాతాలలో 186 కోట్ల రూపాయల జమ
#### - జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**మంచిర్యాల,మే23, సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 321 కేంద్రాలు ద్వారా 19 వేల 824 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 46 వేల 134 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 186 కోట్ల 12 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 108 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు.



ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైతు పండించిన ధాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరిక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓ. ఆర్.ఎస్., గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

### రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించిన సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు

**కౌటాల 23 మే సూర్య మేజర్ న్యూస్**
మండలంలోని ముత్తంపేట వరి కొనుగోలు కేంద్రం వద్ద శుక్రవారం వడ్ల కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు రాస్తారోకో నిర్వహిస్తున్నారని తెలుసుకొని వారికి సంఘీభావంగా రోడ్డుపై కూర్చొని రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొన్న సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా ఎం ఎల్ ఏ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి తడిసిన ధాన్యాన్ని కొంటామని చెప్తున్నారని, ఇక్కడేమో మాయిశ్చర్, తప్ప, తాలు అని తీవ్ర జాప్యం చేస్తూ రైతులను నట్టేట



ముంచుతున్నారని తెలిపారు. అకాల మరియు చెడగొట్టు వానల వలన రైతులు ఆందోళనకు గురవుతున్నారని వారిని, ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేశారు.కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే ఇప్పటివరకు 3500 మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అన్నారు.అడిషనల్ కలెక్టర్ సివిల్ సప్లైస్ డేవిడ్ దీక్ష శిబిరాన్ని సందర్శించి వరి కొనుగోళ్లను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు సివిల్ సప్లై కమిషనర్ చౌహాన్తో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కమిషనర్ తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ ఎమ్మార్వో పుష్పలత, ఏవో ప్రేమలత, గిరీషన్, భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, జిల్లా కార్యదర్శి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షురాలు చనకపురే లావణ్య, మాజీ జడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, మాజీ ఎంపిటిసి దుర్గం మోతిరాం, ఒడ్డేటి నాని, కుంచాల సత్తయ్య, శివరాం, నర్సింగ్ రావు, బాలాజీ, సురేష్, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

### కమిషన్లకు కక్కుర్తి పడే

# వంతెన నిర్మించడం లేదు

### - బీజేపీ నాయకులు

### రఘునాథ్ వెరబెల్లి

**మంచిర్యాల టౌన్,సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల - అంతర్గాం మధ్య గోదావరి పై వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మంచిర్యాల గోదావరి వద్ద చేపట్టిన నిరసన బీజేపీ మంచిర్యాల కమిటీ. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా నాయకులు రఘునాథ్ వెరబెల్లి,జిల్లా అధ్యక్షులు నాగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాలుగోన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలంలోనే గోదావరి పై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే బస్ లో వెళ్లే



పేద ప్రజలు ఒక్కొక్కరికి రానుపోను 100 రూపాయల మిగులుతాయని అన్నారు. ఇక్కడ వంతెన నిర్మించకపోవడం వల్ల ఏడాదిలో 80 నుండి 100 కోట్ల రూపాయల వరకు ప్రజల పై భారం పడుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పది సంవత్సరాలు వంతెన నిర్మాణం చేపట్టకుండా కాలయాపన చేస్తే,ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే తన స్వార్థ ప్రయోజనాల కోసం కమిషన్లకు కక్కుర్తి పడి ఇక్కడ వంతెన నిర్మించకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే మంచిర్యాల- అంతర్గం మధ్య వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ వంతెనకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. ఇంకో వంతెన ముల్కల్ల వద్ద నిర్మించాలి అనుకుంటే ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణం చేపట్టాలని అన్నారు. మంచిర్యాల- అంతర్గం మధ్య వంతెన నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్,పెద్దపల్లి పురుషోత్తం,గాజుల ముఖేష్ గౌడ్,బియ్యాల సతీష్ రావు,పానుగంటి మధు,పట్టి వెంకట కృష్ణ,మోటపలుకుల తిరుపతి,ఆకుల అశోక్ వర్ధన్,జోగుల శ్రీదేవి,మాదవరపు వెంకట రమణ రావు,బొలిశెట్టి అశ్విన్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు,కోడి రమేష్, మోతె సుజాత,కర్ర లచ్చన్న,సత్రం రమేష్, గడ్డం స్వామి రెడ్డి,హేమంత్ రెడ్డి,బోయిని హరి కృష్ణ,గురువయ్య,గుండా ప్రభాకర్,రాకేష్ రెన్వ, పచ్చ వెంకటేశ్వర్లు,ఈర్ల సదానందం,గాజుల ప్రభాకర్,కమలాకర్ రావు,వైద్య శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూములపై

### అటవీశాఖ నిరంకుశత్వం సరికాదు

**వేమనపల్లి ,23మే, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని చామనపల్లి గ్రామంలో పట్టా భూముల పై అటవీశాఖ నిరంకుశత్వం సరి కాదు అని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం




జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం శుక్రవారం సరికాదని అన్నారు ఈ సందర్భంగా గ్రామంలోని ఆదివాసిల సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం మాట్లాడుతూ ఈ యొక్క గ్రామంలో ఆదివాసి పేదలకు గత కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నంబర్ 67 లో వ్యవసాయం చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేశారు. కానీ అటవీశాఖ అధికారులు ఆ భూములను సాగు చేసుకోని ఇవ్వకుండా రెవెన్యూ భూమిని కూడా అటవీ భూమి అంటూ ఆదివాసులను బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి, ఈ భూమిని వ్యవసాయం చేస్తే మీ పైన కేసులు పెడతామని బెదిరిస్తున్నారు, రెవెన్యూ భూమి పైన అటవీశాఖ అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారు ఇప్పటికే అనేకసార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్న ఏమాత్రం కూడా పట్టించుకోకుండా తమకేమీ సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి రెవెన్యూ భూమి పైన పెత్తనం చెలాయిస్తున్న అటవీశాఖ అధికారుల వేధింపులను ఆపి పేదల భూములను సాగు చేసుకునే విధంగా చూడాలని, అటవీ హక్కు పత్రాలు కలిగిన భూములను ట్రాక్టర్లతో దున్ని వ్యవసాయం చేసుకోమని జిల్లా కలెక్టర్ చెప్పినప్పటికీ అటవీశాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టుగా ఆదివాసులను భూమి నుండి వెల్లగొట్టడమే లక్ష్యంగా పెట్టుకుని వ్యవహరించడం ఏ మాత్రం కూడా సరికాదని అన్నారు, స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆదివాసీల కు కనీస అవసరాలు కల్పించలేదని అంటే ఈ ప్రభుత్వాలు ఎవరికోసం పనిచేస్తున్నాయని ప్రశ్నించారు, త్రాగడానికి గుక్కెడు నీళ్ల కోసం కిలోమీటర్ల మేర నడిచి పెద్దవాగు నుండి త్రాగునీరు తెచ్చుకొని దాహాన్ని తీర్చుకుంటున్నారు ప్రజా ప్రతినిధులకు ఆదివాసీల ఓట్లతో అవసరం ఉంది కానీ ఆదివాసులకు మాత్రం కనీస అవసరాలు తీర్చే బాధ్యత ఎందుకు లేదని ప్రశ్నించారు ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఇక్కడి ఆదివాసీలకు తగు న్యాయం చేయాలని కోరారు, అనంతరం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం గ్రామ కమిటీని కొమిరెల్లి సాగర్, రెడ్డి కిరణ్ అధ్యక్ష కార్యదర్శులుగ 20 మంది తో కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి చీకటి, కొమురెల్లి మొండి, కొమురెల్లి అంజి, రేగుంట కమల, రెడ్డి మదునక్క, కొమురెల్లి ఓదక్క, మంచాల గౌతమి, మానెపల్లి శంకరమ్మ, కొమురెల్లి నీలిమ, కొమురెల్లి రాజక్క, జంపం మొండి, మెస్రం సమ్మక్క, మరియు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో పడి ఇద్దరు విద్యార్థులు మృతి

**కౌటాల 23 మే సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని తాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గోవార్ హెట్టి గ్రామంలో శుక్రవారం ఒక్కసారిగా విషాదం చోటుచేసుకుంది.



వివరాలలోకి వెళ్తే బోయేర్ లక్ష్మీ (11),సిండే హన్సిక (12) అనే విద్యార్థినిలు వేసవిలో సెలవులు కావడంతో గ్రామ సమీపంలో సరదాగా ఆడుకుంటూ ఇద్దరు చిన్నారులు వ్యవసాయ కుంటలో పడి శుక్రవారం మృతి చెందినారు. మృతి చెందిన ఇద్దరు పిల్లలను హత్తుకొని తల్లితండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించింది. ఆడుతూ పాడుతూ ఇద్దరు చిన్నారులు కుంటలో శవమై కనిపించడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయాలు అలుముకున్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు,రెవెన్యూ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపదుతున్నారు.

### టింబర్ డిపో ను ప్రారంభించిన నిర్మల్ ఎమ్మెల్యే

**సారంగాపూర్,ఏప్రిల్24, సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన టింబర్ డిపోను



నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టింబర్ డిపో నిర్వాహకుడు సిద్దు,బిజెపి మండల అధ్యక్షుడు కాల్వ నరేష్,ఉపాధ్యక్షులు తిరుమల చారి, జిల్లా నాయకులు రావుల రామ్నాథ్,సాహెబ్ రావు,సామల వీరయ్య,రాజు,శేఖర్,అనిల్,తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్య మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఛాంబర్ అఫ్ కామర్స్.

**మంచిర్యాల టౌన్,మే 23,సూర్య మేజర్ న్యూస్:** మంచిర్యాల పట్టణం లో పైలట్ ప్రాజెక్ట్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ పవర్ సప్లై,రోడ్ల విస్తరణ కు,విద్యుత్ దీపాలకు 78కోట్లు నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటలకు మంచిర్యాల ఛాంబర్ అఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వ్యాపారాలు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కి ఎమ్మెల్యే చేస్తున్న కృషి చాలా గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ గుండ సుధాకర్ ,సెక్రటరీ ఇరుకుల్ల శ్రీనివాస్, సభ్యులు మంగిలాల్ సోమానీ,జుగల్ కిషోర్ వ్యాస్,తొగరి సుధాకర్,మాదం శెట్టి సత్యనారాయణ,దొంతుల ముఖేష్,సంఘం జగదీష్,రావుల మహేష్, వ్యాపార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షరాభిషేకం

**మంచిర్యాల టౌన్,మే 23,సూర్య మేజర్ న్యూస్ :**

మంచిర్యాల జిల్లా కేంద్రం లోని మార్కెట్ ఏరియా లో శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో పట్టణ మార్కెట్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు అయినా సందర్బంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్ర భట్టి విక్రమార్క,ప్రేంసాగర్ రావు చిత్ర పటాలకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్బంగా పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ మాట్లాడుతూ



మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు ఎన్నికల లో ఇచ్చిన హామీల కంటే పట్టణం లో ఎక్కువ అభివృద్ధి చేయాలని సంకల్పం తో ఉన్నారన్నారు. గత పాలకులు నియోజకవర్గంని అభివృద్ధి లో తిరోగమాన దిశాగా తీసుకెల్లరని,దీన్ని అధిగామించాలంటే చాలా కృషి అవసరమని ఎమ్మెల్యే అన్నారన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి తో, ఉప ముఖ్య మంత్రి తో,ఇతర శాఖల మంత్రులతో చేర్చించి నియోజకవర్గం కు కావలసిన అభివృద్ధి పనులకు నిధులు తేవడానికి ఎమ్మెల్యే తీవ్రంగా శ్రేమిస్తునరన్నారు. రాష్ట్రము లో పైలట్ ప్రాజెక్ట్ లో భాగం గా మార్కెట్ ఏరియా లో అండర్గ్రౌండ్ డ్రైనేజీ,అండర్గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ కోసం 78 కోట్లు నిధులు తేవడం ప్రజలకు కు చాలా ఉపయోగం అన్నారు. కేవలం హైదరాబాద్ లని మహా నగరం లోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పవర్ సిస్టం ఉంటాయని, అలాంటి సదుపాయలు పట్టణం లో ఏర్పాటు చేయడం చాలా సంతోషం అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కి ఇప్పటికే 2000 కోట్లు నిధులు సాధించడం ఒక ప్రేంసాగర్ రావు కె చెందింది అన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఒక సభలో తన స్వంత నియోజకవర్గం మంత్తిని లో కూడా మంచిర్యాల లో జరుగుతున్న అభివృద్ధి జరగడంలేదన్నారు. ఎమ్మెల్యే అనునిత్యం మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి చేయాలనే తపన తో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాలుగోన్నారు.

### చీటిల పేరు తో

# మోసం చేసిన వ్యక్తి కి జైలు శిక్ష

**మంచిర్యాల టౌన్, మే 23,సూర్య మేజర్ న్యూస్ :**

చీటి కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తికి శుక్రవారం రెండు ఏళ్ళు జైలు శిక్ష, 10000/- రూపాయలు జరిమానా విధించిన మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి కె. నిరోషా. మంచిర్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు తెలిపిన వివరాల ప్రకారం గాజుల సుజాత ధన సిద్ధి చిట్ ఫండ్ నందు చీటి వేసి 92750/-రూపాయలు కట్టారు. కానీ తన డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన రాంమోహన్ పై పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేశామన్నారు.

### నీటి ప్రవాహం ఎక్కువ వున్నప్పుడు

# వాగు దాటకూడదు

**కెరమెరి సూర్య మేజర్ న్యూస్**

నీటి ప్రవాహం ఎక్కువ ఉన్నప్పుడు వాగు దాటకూడదని ఏఎస్పీ చిత్త నిరంజన్ అన్నారు మండలంలోని గౌరియాగూడ వద్ద పెద్దవాగును శుక్రవారం పరిశీలించారు గురువారం కురిసిన భారీ వర్షానికి తాత్కాలికంగా నిర్మించుకున్న వంతెన కొట్టుకపోవడంతో ఆ గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు అత్యవసర పరిస్థితుల్లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అధికారులను సంప్రదించాలని సూచించారు వర్ష కాలానికి సరిపోయేంత సరుకులను ముందే సమకూర్చుకోవాలని అక్కడి గ్రామస్తులకు తెలిపారు ఆయన వెంట సిఐ సత్యనారాయణ ఎస్ఐ మధుకర్ ఎంపీడీవో అంజి పాషా తదితరులున్నారు.



## నిర్మల్ బాక్సర్లు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

**నిర్మల్ మే 23, సూర్య మేజర్ న్యూస్:**

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, బాల, బాలికల బాక్సింగ్ పోటీలకు నిర్మల్ జిల్లా నుండి పలు విభాగాలలో క్రీడాకారులు ఎంపిక హర్షనీయం మంచిర్యాలలో మే 24 నుంచి 26 వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి సబ్



జూనియర్, బాల, బాలికల బాక్సింగ్ పోటీలకు నిర్మల్ జిల్లా నుండి పలు విభాగాలలో క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో అండర్-17 కేటగిరీలో నికిత (44-46), అక్షిత (46-48), కీర్తన (48-50), అభినయ (52-54), శ్రావణి (58-60) ఎంపిక చేశారు. బాలుర విభాగంలో అండర్-14 కేటగిరీలో దీక్షిత్ (40-42), కృషి రెడ్డి (42-44), శౌర్యన్ రెడ్డి (48-50) అలాగే అండర్-17లో అభిలాష్ (44-46) బరువులలో పాల్గొననున్నారని నిర్మల్ జిల్లా బాక్సింగ్ సెక్రటరీ, కోచ్ స్వామి తెలిపారు. జిల్లాను గర్వపెట్టేలా ఈ క్రీడాకారులు ప్రతిభ కనబర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా క్రీడాధికారి శ్రీకాంత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్, బాక్సింగ్ సంఘ అధ్యక్షుడు శ్రీధర్, కార్యవర్గ సభ్యులు వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## డయల్ యువర్ డి. ఎం. కార్యక్రమం

**నిర్మల్ మే 23, సూర్య మేజర్ న్యూస్.**

శనివారం మే ఉదయం 11 గం. ల నుండి 12 గం. ల వరకు డయల్ యువర్ డి. ఎం.కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపోమేనేజర్ కే




పండరి తెలిపారు.సూచనలు,సలహాలు,ఫిర్యాదులు,ఆర్టీసీ బస్సుల సమయ పాలన గురించి నేరుగా 9959226003 కి ఫోన్ చేసి డిపోమేనేజర్ తో మాట్లాడాలని ఆయన తెలిపారు.

## నిద్రమత్తులో అటవీశాఖ? ప్రాణాలు పోయినాక పంచనామా చేస్తారు

**-ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా..?**

**- రెండు రోజుల నుంచి స్పందించని అటవీశాఖ అధికారులు.**

**కాగజ్నగర్, మే 23, సూర్య మేజర్ న్యూస్:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం



కేతిని గ్రామంలోని పల్లె ప్రకృతి వనం వద్ద అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి రోడ్డుపై చెట్టు విరిగిపడి ఉండడంతో ప్రయాణికుల (వాహనదారుల) రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఫారెస్ట్ అధికారులు స్పందించి రోడ్డుపై విరిగున్న చెట్టును తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. రెండు రోజుల నుంచి రోడ్డుకు అడ్డంగా వృక్షాలు పడి ఉన్న పట్టించుకోని అటవీ శాఖ అధికారులు. వర్షాలు గాలి దుమారాలు కరెంట్ కోతలు వీటివల్ల ఏవైనా అనుకోని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు? ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న వృక్షాలను తొలగిస్తారో లేదో చూడాల్సి ఉంది.

## ధర్నాను విజయవంతం చేయండి

**- ముంజం ఆనంద్ కుమార్**

**కాగజ్నగర్ ,మే 23, సూర్య మేజర్ న్యూస్:**

ఉపాధి హామీ కార్మికులకు రోజు కూలీ 600 రూపాయల ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరుతూ ఈనెల 30న ఆసిఫాబాద్ కలెక్టరేట్ ముందు నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయండన్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రోజు కూలీ 600



రూపాయలు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని ఈనెల 30న ఆసిఫాబాద్ కలెక్టరేట్ ముందు నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికులు ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాగజ్ నగర్ మండలం వంజిరి, బటుపల్లి గ్రామలలో ఉపాధి హామీ కార్మికులతో కలిసి ధర్నా కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తున్నదని అన్నారు.రోజు రోజుకు కూలీల సంఖ్య పెరుగుతుంటే బడ్జెట్లో నిధులు మాత్రం తగ్గిస్తున్నారని ఆవేదన



వెలిబుచ్చారు. ఈ సంవత్సరం 2.50 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని అడిగితే రూ 86 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. రాష్ట్రంలో ఆరు కోట్ల పని దినాలు అవసరం ఉంటే మూడు కోట్ల పని దినాలు మాత్రమే కల్పించిందని మిగతా పని దినాలు కూలీలు ఏం చేయాలని ప్రశ్నించారు. కొత్త కొత్త జీవోలు తెచ్చి ఉపాధి హామీని, అందులో పని చేస్తున్న కూలీలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పెండింగ్ లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని, కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని, పని ప్రదేశంలో త్రాగునీరు , నీడకు టెంట్,మెడికల్ కిట్టు వంటి సౌకర్యాలు కల్పించాలని, భార్యాభర్తలకు గడ్డపార, తట్ట , పార , కొడవలి, గొడ్డలి వంటి పనిముట్లు ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, నాలుగు కిలోమీటర్ల దాటితే లోకల్ ఆటో చార్జీలు చట్ట ప్రకారం ఇవ్వాలని, ఆధార్ కార్డు అన్లైన్ పేమెంట్ చెల్లింపులు, కొలతలు ఆధారంగా వేతనాలు ఇచ్చే పద్ధతి రద్దు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వాచర్లు, మెట్లను ప్రత్యేకంగా గుర్తించాలని, ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యం అందించాలని, మరణిస్తే 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, కార్మికులు పని అడిగినప్పుడు పని ఇవ్వకుంటే చట్టం ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలే డిమాండ్స్ తో నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికులు, పేదలు ఎత్తున పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ తో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనాలి

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**నేరడిగొండ మే 23 సూర్య మేజర్ న్యూస్ :**

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను అకాల వర్షాలతో తడిసి ముద్దయిన జొన్నలను ప్రభుత్వం కొనాలని ఎమ్మెల్యే అనిల్



జాదవ్అన్నారు. మండలంలోని వ్యవసాయ శాఖ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రతి తడిసిన పంటను ప్రభుత్వం కొనాలని అన్నారు ప్రభుత్వము కొనకపోతే దగ్గర ఉండి కొనేటట్లు చేయిస్తానని రైతులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంబడి రైతులు టీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు

### వివిధ మండలాల నూతన వధూవరులను ఆశీర్వదించిన

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్.**

నిరడిగొండ మే 23 సూర్య మేజర్ న్యూస్. బోథ్ నియోజకవర్గం లోని నేరడిగొండ మండలం ని చిన్న బుగ్గారం గ్రామానికి చెందిన రాథోడ్ రవీందర్ కుమార్తె వివాహానికి, కుమారి గ్రామానికి చెందిన రవీందర్ కుమార్తె పెళ్లికి అలాగే బోథ్ కు చెందిన నాగరాజు కుమారుని పెళ్లికి



సోనాల మండలంలోని సాకర గ్రామానికి చెందిన భీంరావ్ కుమారుని టీలా కార్యక్రమానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంబడి మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి,తుల శ్రీనివాస్, ఇచ్చోడ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి,బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్, ఇచ్చోడ మాజీ ఉపసర్పంచ్ శిరీష్ రెడ్డి, తానాజీ,అల్లం కొంద ప్రశాంత్,బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలు తదితరులు ఉన్నారు.

## కష్టించి పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలి

**- జనరల్ మేనేజర్ జి దేవేందర్**

**మందమర్రి, మే 23, సూర్య మేజర్ న్యూస్.**

విధులకు గైర్హాజరు కాకుండా కష్టించి పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని కారుణ్య నియామకాల ద్వార సింగరేణి సంస్థలో నూతనంగా ఉద్యోగం పొందిన యువ కార్మికులకు ఏరియా జనరల్ మేనేజర్ జి



దేవేందర్ సూచించారు. శుక్రవారం ఏరియాలోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ ఇన్ వాలిడేషన్ 10 / డిఫరెంట్లీ ఏబుల్ డిపెండెంట్ 1 మొత్తంగా ఉద్యోగం పొందిన 11 మంది వారసులకు కారుణ్య నియామక ఉత్తర్వుల పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వార ఇప్పటివరకు మందమర్రి ఏరియాలో 1985 మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇతర ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పోలిస్తే సింగరేణిలో పని స్థలాలు, సమయాలు భిన్నంగా ఉంటాయన్నారు. నూతన ఉద్యోగులు విధులకు గైర్హాజరు ఐతే ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని యువ కార్మికులు కష్టించి పనిచేసి సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి రమణ, అధికారుల సంఘం అధ్యక్షులు రమేష్, డివైపిఎం సత్య బోస్, కార్యాలయ సూపరింటెండెంట్ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

### గ్రూప్-2 ఉద్యోగానికి ఎంపికయిన రామకృష్ణాపూర్ యువకుడు

**రామకృష్ణాపూర్, మే 23, సూర్య మేజర్ న్యూస్.**

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన గాజుల శ్రీనివాస్ అనే యువకుడు ఇటీవల టీజి పి ఎస్ సి నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరచి గ్రూప్2 ఉద్యోగానికి ఎంపిక కావడం జరిగింది,నిన్న టీజి పి ఎస్ సి విడుదల చేసిన గ్రూప్ 2 తుది ఫలితాలలో 1:1 లిస్ట్ లో చోటు సంపాదించడం జరిగింది.గతంలో



గ్రూప్4, పంచాయతీ సెక్రెటరీ గా ఉద్యోగాలు సాధించి ప్రస్తుతం ఆసిఫాబాద్ జిల్లాలో పంచాయతీ సెక్రెటరీ గా విధులు నిర్వహిస్తున్నారు, 3 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినందుకు గాను గాజుల శ్రీనివాస్ ను పట్టణ ప్రముఖులు అభినందించడం జరిగింది.

### శివాజీ విగ్రహ ఏర్పాటుకు విరాళం అందచేసిన నిర్మల్ ఎమ్మెల్యే

**సారంగాపూర్,ఏప్రిల్ 24, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని వైకుంఠపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శివాజీ విగ్రహం కొరకు నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి భారీ విరాళాన్ని అందజేసినట్లు సారంగాపూర్ మండల బిజెపి ఉపాధ్యక్షులు సుంకరి శ్రీకాంత్ తెలిపారు.వైకుంఠపూర్ గ్రామం లో ఏర్పాటు చేయనున్న శివాజీ విగ్రహం కొరకు 1,10,000 రూపాయల విరాళాన్ని శుక్రవారం రోజు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాసంలో అందజేసినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమం లో బిజెపి మండల నాయకులు సాహెబ్ రావు,హనుమాన్ యూత్ సభ్యులు రాజు, రఘు, నితిన్, అశ్విన్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

